ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
బుధవారం 3 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం సా : 6.34 గం.
సహర్ : గురువారం ఉ: 4:46 గం.



మండుతున్న ఉమ్మడి జిల్లా
43 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

- మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- మూడు జిల్లాలకూ అరెంజ్ అలర్ట్
- ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
- బయటకు వెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

చిట్యాల	43
నిజాంపేట	42.1
కౌడిపల్లి	42

నిప్పుల కుంపటి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 2: ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. రెండ్రోజులుగా జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రత సగటున 41 డిగ్రీలు దాటింది. అత్యధికంగా సిద్దిపేట జిల్లా చిట్యాలలో మంగళవారం 43 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో 42.6 డిగ్రీలు, మెదక్ జిల్లా కౌడిపల్లిలో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడం ఆందోళన కలిగిస్తున్నది. ఎండల తీవ్రతకు మధ్యాహ్న సమయంలో ఉమ్మడి జిల్లాలోని ముఖ్య కూడళ్లు నిర్మానుషంగా మారాయి. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. సాయంత్రం 5 దాటినా ఎండ వేడిమి తగ్గడం లేదు.

చిట్యాలలో అత్యధికం

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అత్యధికంగా సిద్దిపేట జిల్లా చిట్యాలలో 43 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. దూళిమిట్టలో 42.9 డిగ్రీలు, లక్దారంలో 42.1 డిగ్రీలు, సిద్దిపేట అర్బన్‌లో 41.7 డిగ్రీలు, కట్కూర్‌లో 41.6 డిగ్రీలు, సిద్దిపేట రూరల్‌లో 41.2 డిగ్రీలు, మద్దూర్‌లో 41.1 డిగ్రీలు, రాంపూర్‌లో 41.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో 42.6 డిగ్రీలు, సదాశివపేటలో 42.2 డిగ్రీలు, కల్హేర్‌లో 41.9 డిగ్రీలు, పాశమైలారంలో 41.6 డిగ్రీలు, వట్‌పల్లి, కొండాపూర్‌లో 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా కౌడిపల్లిలో 42 డిగ్రీలు, పొడ్చన్‌పల్లిలో 41.2 డిగ్రీలు, శివ్వంపేటలో 41.1 డిగ్రీలు, కొల్చారంలో 41.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



సిద్దిపేట జిల్లా మిట్టపల్లిలో కుంట వద్ద నీళ్లు తాగుతున్న జీవాలు

ఇంకా పెరిగే అవకాశం

రాబోయే రెండు.. మూడు రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తున్నది. ఉమ్మడి జిల్లాలో ఈ నెల 5 వరకు 44 డిగ్రీలకు చేరుకునే అవకాశముందని హెచ్చరిస్తున్నది. అందుకే ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎండవేడికి వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



సిద్దిపేటలో..

అరెంజ్ అలర్ట్‌లో పేర్కొన్న ప్రాంతాలు

సిద్దిపేట జిల్లాలోని చిట్యాల, దూళిమిట్ట, లక్దారం, సిద్దిపేట, కట్కూర్, రాఘవపూర్, రేంబర్తి, రాంపూర్, సముద్రాల, కోహెడ, బెజ్జంకి, కొమరవెల్లి, కొండపాక, హుస్నాబాద్, చేర్యాల, తొగిట.. సంగారెడ్డి జిల్లాలోని నిజాంపేట, సదాశివపేట, పాశమైలారం, కల్హేర్, వట్‌పల్లి, కొండాపూర్, జిన్నారం, కంది, నారాయణఖేడ్, అమీన్‌పూర్, సిర్గాపూర్, కిష్టారెడ్డిపేట, ఆర్సీపురం, చౌటకూర్, గుమ్మడిదల, కడ్పల్, సుల్తాన్‌పూర్, మెదక్ జిల్లాలోని కౌడిపల్లి, పొడ్చన్‌పల్లి, కొత్తపేట, శివ్వంపేట, కొల్చారం, దామారంచ, రేగోడ్, పాతూర్, అల్లాదుర్గం తదితర గ్రామాలు ఆరెంజ్ అలర్ట్ పరిధిలో ఉన్నాయి.

అత్యవసరమైతేనే బయటకు..

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అత్యవసరమయితే తప్ప ఎండల్లో బయటకు రావొద్దు. ఎండలో తిరగాల్సివస్తే గొడుగు, టోపీ వినియోగించాలి. వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలి.

-రాహుల్‌రాజ్, మెదక్ కలెక్టర్

ఎండల్లో ఆరోగ్యం జాగ్రత్త | 7లో



సైబర్ వారియర్స్‌తో సీపీ అనూరాధ

సైబర్ క్రైం యూనిట్

- నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగం
- సిబ్బందికి పలు అంశాల్లో శిక్షణ
- సైబర్ నేరాల అదుపు చాలెంజ్‌గా తీసుకోవాలి : ఎస్పీ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 2 : ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ప్రజల్లో ఎంత అవగాహన కల్పిస్తున్నా సైబర్ నేరాలు ఆగడం లేదు. రోజుకో రూపంలో సరికొత్త ఎత్తులతో సైబర్ నేరగాళ్లు ప్రజల జేబులను కొల్లగొడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాల అదుపునకు జిల్లా ఎస్పీ డాక్టర్ బి. అనూరాధ నడుం బిగించారు. పెరిగిపోతున్న టెక్నాలజీకి తగ్గట్టుగానే సైబర్ నేరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో సైబర్ క్రైమ్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల వారీగా సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లా పరిధిలో మొత్తం 26 మందిని ఎంపిక చేసి ఆర్థిక నేరాలు, కంప్యూటర్ వైరస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీ చాలెంజెస్, రిస్క్ అండ్ మేనేజ్‌మెంట్, నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ యాక్ట్, కమ్యూనికేషన్ వ్యవస్థ, ఇంటర్‌నెట్ డేటా సెంటర్, నెట్ వర్కింగ్ వ్యవస్థ, నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్, ఇన్ఫర్మేషన్ ఆడిటింగ్ కంప్లైన్స్, ఐవోటీ, క్లిష్టమైన వెబ్ అప్లికేషన్స్, సెక్యూరిటీ రిస్క్, మొబైల్ అప్లికేషన్స్ సెక్యూరిటీ, సోషల్ మీడియా ఇన్ ఈ గవర్నెన్స్, ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు.

నేరాల అదుపునకు..

జిల్లాలో సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ డాక్టర్ బి. అనురాధ తెలిపారు. సైబర్ వారియర్స్‌కు మంగళవారం నూతన ఫోన్లు, సిమ్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో జరిగే సైబర్ నేరాలను ఎక్కడికక్కడే నియంత్రించేందుకు పోలీస్‌స్టేషన్ వారీగా ఈ విభాగాలు కృషి చేస్తాయని తెలిపారు. సైబర్ కేసుల్లో పూర్తి స్థాయి ఆధారాలు సేకరించి నేరస్థులను గుర్తించటం, నేరగాళ్లకు శిక్ష పడేలా చేయడం, బాధితులకు న్యాయం చేయడాన్ని సైబర్ వారియర్స్ చాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ శేఖర్, సైబర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది రాము, హరీశ్, సైబర్ వారియర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వారియర్ల ఫోన్ నంబర్లు

సిద్దిపేట రూరల్	- 8712657665
సిద్దిపేట 3 టౌన్	- 8712657666
గౌరారం	- 8712657667
తొగుట	- 8712657668
రాజగోపాల్‌పేట	- 8712657669
మర్కుక్	- 8712657760
సిద్దిపేట 2 టౌన్	- 8712657761
సిద్దిపేట 1 టౌన్	- 8712657762
కొముర‌వెల్లి	- 8712657763
రాయపోల్	- 8712657764
అక్కన్నపేట	- 8712657765
మద్దూర్	- 8712657766
చేర్యాల	- 8712657767
భూంపల్లి	- 8712657768
కుకునూరుపల్లి	- 8712657769
మిరుదొడ్డి	- 8712657770
ములుగు	- 8712657771
జగదేవ్‌పూర్	- 8712657772
బేగంపేట	- 8712657773
గజ్వేల్	- 8712657774
దౌల్తాబాద్	- 8712657775
దుబ్బాక	- 8712657776
చిన్నకోడూరు	- 8712657778
కోహెడ	- 8712657779
హుస్నాబాద్	- 8712657780
బెజ్జంకి	- 8712657781

వందరోజుల హామీలు ఏమయ్యాయి..

ఎన్నికల కోడ్ పేరు చెప్పి కాలయాపన చేస్తున్న కాంగ్రెస్.. హరీశ్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటు కష్టాలు చూస్తున్నారని, ఇప్పటికే చాలా పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ వంద రోజుల హామీలను నిలబెట్టుకొని రైతులకు ఇచ్చిన మాటను నెరవేర్చాలని, వరికి రూ. 500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేటలో కలెక్టర్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ సాగునీరు రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. 24 గంటల్లో కూడవెళ్లి వాగుకు నీళ్లు విడుదల చేయకపోతే, మల్లన్నసాగర్‌ను ముట్టడిస్తామని అన్నారు. వడగండ్ల వానతో, సాగునీరు అందక ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 100 రోజుల్లో చేస్తానన్న హామీలను కాంగ్రెస్ విస్మరించిందని విమర్శించారు. ఎన్నికల కోడ్ ఉందని కాలయాపన కబుర్లు చెబుతున్నారని అన్నారు. టీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నా.. లేకున్నా రైతు పక్షపాతి గానే ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ హామీల విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమని హరీష్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరు తగ్గి కన్నీళ్లు పెరిగాయని అన్నారు. దాదాపు 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతుల సమస్య కాంగ్రెస్ ప్రభుత్వానికి కామెడీగా కనిపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రోజా శర్మ, బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణశర్మ, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రాత్రంతా వ్యవసాయ బావిలోనే..

పైప్ పట్టుకుని వేలాడుతూ..

- ప్రమాదవశాత్తు పడి.. ప్రాణాలతో బయటికి..
- రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 2: ప్రాణాలు అరచేత పట్టుకుని.. వ్యవసాయ మోటర్ పైప్‌లైన్ పట్టుకుని రాత్రంతా వ్యవసాయ బావిలోనే ఉండిపోయాడు. రక్షించండి.. అంటూ అతడు పెట్టిన కేకలు ఆ రాత్రి ఎవరి చెవిన పడకపోయినా.. ఉదయమే అతని అరుపులు విన్న రైతు స్పందించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే.. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన వల్లెపు రాజయ్య సోమవారం రాత్రి హుస్నాబాద్ నుంచి తన ఇంటికి కాలినడకన వస్తున్నాడు. గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. బావిలో నీరు ఉండటంతో ఎలాంటి గాయాలు కాలేదు. కానీ, బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో రాత్రంతా బావిలోని వ్యవసాయ మోటార్ పైపును పట్టుకుని ఉండిపోయాడు. మంగళవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు నీరు పెట్టేందుకు రైతు రాగా, బావిలో ఉన్న రాజయ్య 'రక్షించండి' అంటూ అరిచాడు. ఆ అరుపులు విన్న రైతు వెంటనే విషయాన్ని గ్రామస్థులకు చెప్పడంతో వారు వచ్చి తాళ్లసహాయంతో రాములును బయటికి తీసేందుకు ప్రయత్నించగా, సాధ్యం కాలేదు. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి.. నిచ్చెన సహాయంతో రాములును బయటికి తీశారు. సమయానికి వచ్చి రాజయ్యను కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని గ్రామస్థులు అభినందించారు.



ప్రాణాలతో బయటపడ్డ రాజయ్య



రాజయ్యను బయటకి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- ప్రభుత్వ ఖజానాకు రూ.156.15 కోట్లు అధికంగా జమ
- ఉమ్మడి జిల్లా పరిధిలో 16 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.942.87 కోట్ల ఆదాయం
- 1,20,301 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- 2023-24 సంవత్సరానికి 1,28,124 ఆస్తుల నమోదు
- సంగారెడ్డిలో తగ్గుదల.. పటాన్‌చెరులో జోరు

రిజిస్ట్రేషన్ల ఆదాయం 1099.02 కోట్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, ఏప్రిల్ 2 : వరుస ఎన్నికలు.. కోడ్ ఉన్నా రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగుతున్నది. ఆ శాఖ ద్వారా రాష్ట్ర ఖజానాకు వచ్చే రాబడి భారీగా పెరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. గత మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన ఆదాయం రూ.156.15 కోట్లు పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1,20,301 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.942.87 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ఆ వెంటనే 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,28,124 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు 1099.02 కోట్ల రాబడి వచ్చి చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఆదాయం గణనీయంగా తగ్గింది. కొత్తగా ఏర్పడిన పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో మాత్రం భారీగా ఆదాయం సమకూరింది.

కొత్తగా ఏర్పాటై..

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గతేడాది కొత్తగా ఏర్పాటైంది. అంతకుముందు వరకు పటాన్‌చెరు నియోజకవర్గం.. సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో కొనసాగింది. పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్ మండలాలతో కొత్తగా పటాన్‌చెరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటైనా.. సంవత్సరం నుంచి సంగారెడ్డి కార్యాలయంలోనే ప్రత్యేకంగా కొనసాగుతుండడం గమనార్హం.

గజ్వేల్‌లో తగ్గి.. దుబ్బాకలో పెరిగి..

2022-23 ఆర్థిక సంవత్సరం పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో గజ్వేల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ఆదాయం గణనీయంగా తగ్గింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో 12,957 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.58.88 కోట్ల ఆదాయం వచ్చింది. కానీ గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 2,117 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తగ్గడంతో 39.29 శాతం మేర ఆదాయం తగ్గింది. రూ.35.74 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అదే సమయంలో దుబ్బాక సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాబడి పెరిగింది. ఈ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,272 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 3.18 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే, 2023-24 సంవత్సరంలో 342 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పెరగడంతో రాబడి 48.12 శాతం మేర పెరిగింది. అదనంగా రూ.4.71 కోట్లు ఖజానాకు చేరాయి.

పటాన్‌చెరు రికార్డు

పటాన్‌చెరు ప్రాంతంతో కలిసి ఉన్న సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 2022-23లో 39,906 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రభుత్వ ఖజానాకు రూ.634.09 కోట్ల ఆదాయం చేకూరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 9,548 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగి రూ.5.97 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఇదే సంవత్సరం సంగారెడ్డి నుంచి విడదీసి కొత్తగా ఏర్పాటు చేసిన పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 37,784 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగి.. ఖజానాకు రూ.768.34 కోట్ల ఆదాయం ఖజానాకు సమకూరింది.

సిటీ శివారులోనే అత్యధికం

పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి అంతా హైదరాబాద్ శివారు ప్రాంతంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రాంతాలే. ఈ ప్రాంతాలలో ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ ధర చ.గ.కు రూ. వేలల్లో ఉన్నది. పైగా ఈ ప్రాంతలో ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోళ్లు ఎక్కువ సంఖ్యలోనే జరుగుతుంటాయి. ఈ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోనే ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న తెల్లాపూర్, కొల్లూరు, ఉస్మాన్‌నగర్, పాటి తదితర గ్రామాలలో నిర్మాణమవుతున్న అపార్టమెంట్ల సంఖ్య వందల్లో ఉన్నాయి. అలాగే వెంచర్లు కూడా ఏర్పాటయ్యాయి. అందుకే ఈ ప్రాంతంలో ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు ఎక్కువ సంఖ్యలో జరుగుతుండడంతో ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం ఏ యేటి కా యేడు పెరుగుతూనే ఉండడం విశేషం.



సంగారెడ్డిలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కోడ్ అమలులో ఉన్నా..

గత అక్టోబరు, నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయినా ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కడ కూడా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు ఆగలేదు. అయితే అంతకుముందు నెలతో పోల్చితే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు కొన్ని ప్రాంతాల్లో తగ్గి, మరికొన్ని ప్రాంతాల్లో పెరిగాయి. ఫలితంగానే 2022-23 ఆర్థిక సంవత్సరం కన్నా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెరగడానికి దోహదపడింది.

అక్రమంగా చెట్ల నరికివేత

శివ్వంపేట, ఏప్రిల్ 2: సంగారెడ్డి-తూప్రాన్ ప్రధాన రోడ్డు సమీపంలోని విలువైన చెట్లను ఇష్టానుసారంగా నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని చండి సమీపంలో కొందరు అక్రమ కలప వ్యాపారులు భారీ వృక్షాలను యంత్రాల సహాయంతో నరికివేసి తరలిస్తున్నారు. ఓ వైపు మొక్కలు పెంచాలని చెప్పే అధికారులు మరోవైపు విలువైన చెట్లు అక్రమంగా నరుకుతున్నా పట్టించుకోకపోవడం విశేషం.

హాస్టల్ విద్యార్థులకు నీళ్ల చారు!

● మెనూ పాటించని సిబ్బంది

● మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామన్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్



గిర్మాపూర్ హాస్టల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి వడ్డించిన అన్నం, నీళ్లచారు

కొండాపూర్, ఏప్రిల్ 2: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అన్నం, కారం నీళ్ల సాంబరును వడ్డించారు. దీంతో అన్నం తినలేక విద్యార్థులు చెత్త డబ్బాలో పారబోశారు. మంగళవారం మధ్యాహ్న భోజనానికి బీట్‌రూట్, లేదా క్యారెట్ కర్రీ, టమాటా పప్పు, రసం, పెరుగు, పచ్చళ్లు అని హాస్టల్ మెస్‌లోని బోర్డుపై డిస్‌ప్లేలో రాసి ఉంచారు. కానీ మెనూ పాటించని సిబ్బంది నీళ్లలో కారం కలిపి ఉన్న నీళ్ల చారును విద్యార్థులకు వడ్డించడంతో తినలేక చెత్త డబ్బాలో పడేశారు. ఈ విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆలీని వివరణ కోరగా.. మెస్ ఇన్‌చార్జిగా ఉన్న అధికారి బాధ్యతలను నిన్ననే చార్జి తీసుకున్నానని, మంగళవారం ఎన్నికల విధుల శిక్షణకు వెళ్లినట్లు తెలిపారు. ఉదయం మెస్‌లో పనిచేస్తున్న సిబ్బందికి మెనూలో ఉన్నవాటి ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని సూచించామన్నారు. మార్కెట్‌లో సమయానికి కూరగాయలు దొరక్క ఆలస్యం కావడంతో.. చేసేది లేక ఉన్నవాటిని విద్యార్థులకు వడ్డించారని చెప్పారు. మళ్లీ ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూస్తామని వెల్లడించారు.

నేత్రపర్వం.. నాచగిరీశుడి బ్రహ్మోత్సవం..


● గజవాహనంపై ఊరేగిన లక్ష్మీనృసింహస్వామి



గజ వాహనంపై నాచగిరి పుర వీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనృసింహస్వామి

వర్గల్, ఏప్రిల్ 2: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి గజవాహనోత్సవ సేవ నిర్వహించారు. స్వర్ణాలంకరణ శోభితులైన లక్ష్మీనరసింహ స్వామి దేవతామూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించిన గజవాహనంపై అధిష్ఠింపజేసి భాజాభజంత్రీలు, మేళతాళలు, వేదమంత్రాల మధ్యన నాచగిరి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. భక్తుల భద్రత దృష్ట్యా గౌరారం పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఎండలతో జాగ్రత్త





ఎండ వేడిమి వల్ల మధ్యాహ్నం జన సంచారం లేక బోసిపోయిన సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా

● పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

● అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలంటున్న వైద్యులు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 2: భానుడు అప్పుడే తన ప్రతాపాన్ని మొదలెట్టాడు. సెగలు కక్కుతూ ఎండలతో జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. దీంతో అనారోగ్యం బారినపడే అవకాశం ఉందంటున్నారు వైద్యులు. ఇప్పటికే మెదక్ జిల్లా అంతటా రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్నది. వాస్తవానికి మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ మార్చి నెలాఖరు నుంచే ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. గతవారం రోజుల నుంచి 40 నుంచి 41 పైబడి వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 నుంచి మొదలైన ఎండవేడిమి సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగుతున్నది. ఉపాధిహామీ, దినసరి కూలీలు, రోజు పనులు చేసుకొనే వారు తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తున్నది. వారు తలకు రుమాలు, గొడుగు తీసుకెళ్లడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. లేకపోతే ఎండ దెబ్బ కొట్టే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీ, ఫ్రిడ్జ్‌లను ఎక్కువగా కొనుగోళ్లు చేస్తున్నారు. అలాగే ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం మజ్జిగ, కొబ్బరిబోండాలకు తాగుతున్నారు. పుచ్చకాయలు, కీరదోస తినడానికి ఆసక్తి చూపిస్తున్నారు.



ఎండలు పెరిగిపోవడంతో నిర్మానుష్యంగా మారిన మెదక్ రాందాస్ చౌరస్తా

వడదెబ్బ లక్షణాలు

- తలనొప్పి, తల తిరగడం
- తీవ్రమైన జ్వరం రావడం
- మత్తు, నిద్ర, కలవరింతలు, మూర్ఛ
- కొంచెం లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం కూడా జరుగుతుంది.



కరీంనగర్ రోడ్డులో ఎండ నుంచి చల్లదనం కోసం పుచ్చకాయలు తింటున్న స్థానికులు

చర్మం పాడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మామూలు రోజుల కంటే ఒక లీటర్ నీరు ఎక్కువగా తాగాలి.
- చర్మం పొడిబారకుండా చూసుకోవాలంటే డీ హైడ్రేషన్ గురికాకుండా శరీరంలో తేమ కోల్పోకుండా చూసుకోవాలి.
- ఎండకు వెళ్లేముందు రోజ్ నీటిని ముఖంపై పూసుకుంటే మంచిది.
- నీటితో కలిపిన మాయిశ్చరైజింగ్ క్రీమును పూసుకోవాలి.
- ఎక్కువసార్లు సబ్బుతో కడగకూడదు.
- వీలైనన్ని సార్లు చల్లటి నీటితో కడుక్కోవడం ఎంతో మంచిది.

ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తెలుపు రంగు పలుచటి కాటన్ దుస్తులను తొడుక్కోవాలి.
- బయటకు వెళ్లే ముందు నెత్తికి టోపీ లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీటిని తాగాలి.
- వడదెబ్బ తగిలిన వారిని వెంటనే చల్లటి ప్రాంతానికి తీసుకెళ్లాలి.
- వడ దెబ్బకు గురైన వారిని తడిగుడ్డతో శరీరం అంత తుడుస్తూ ఉండాలి.
- ఐస్ నీటిలో వస్త్రాన్ని ముంచి శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత 101 ఫారన్‌హీట్ డిగ్రీస్ కంటే తక్కువ వచ్చేవరకు తుడుస్తూ ఉండాలి.
- వడదెబ్బకు గురైనవారు సాధారణ స్థితికి రాకపోతే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.
- ఎండ నుంచి ఇంటికి రాగానే చల్లని నిమ్మరసం లేదా కొబ్బరినీరు, మంచినీరు తాగాలి.
- తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తల తిరుగుడు, ఇతర సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

ఎండలు తీవ్రంగా ఉంటే ఇలా చేయకూడదు

- సూర్య కిరణాలకు, వేడి గాలికి గురికాకూడదు.
- ఎండలో వెళ్తే గొడుగు తీసుకెళ్లాలి.
- వేసవి కాలంలో నలుపు, మందంగా ఉన్న దుస్తులు ధరించకూడదు.
- వడదెబ్బకు గురైనవారిని వేడినీటిలో ముంచిన వస్త్రంతో తుడవద్దు.
- ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ఆలస్యం చేయకూడదు.
- ఉదయం 10 నుంచి 4 గంటల మధ్యలో ఎండలో వెళ్లకుండా చూసుకోవాలి. ఒకవేళ వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండలోంచి ఇంటికి రాగానే తీపి పదార్థాలు, తేనె తీసుకోకూడదు.
- శీతలపానీయాలు, మంచు ముక్కలు వంటివి తీసుకుంటే గొంతుకు సంబంధించిన సమస్యలు రావచ్చు.

అలసత్వం వద్దు



ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లకూడదు. ఒకవేళ వెళ్తే తలకు రుమాలు లేదా టోపీ, నీటి బాటిల్ వెంట తీసుకెళ్లాలి. మధ్యాహ్నం ఆల్కహాల్ తీసుకోకూడదు. ఒకవేళ ఆల్కహాల్ తీసుకున్నట్లైతే స్వేద రంధ్రాలు తెరుచుకుని చెమట రూపంలో గ్లూకోస్ వెళ్లిపోయి ఎక్కువగా డీహైడ్రేషన్ గురవుతారు. కొన్నిసార్లు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంటుంది. తరచూ ఓఆర్ఎస్, మజ్జిగ లాంటివి తీసుకోవాలి.

- పిప్పిరి చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త, మెదక్

బీఆర్ఎస్‌కు శ్రీకృష్ణ జన్మస్థానం ప్రాప్తిరస్తు

● బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

● మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ప్రచారం



మద్దూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న బూర నర్సయ్యగౌడ్

మద్దూరు/ధూళిమిట్ట, ఏప్రిల్ 2: బీఆర్ఎస్ గల్లీలో లేదు, ఢిల్లీలో లేదని ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొద్దిరోజుల్లో చంచల్‌గూడ జైల్లో ఉంటారంటూనే.. శ్రీకృష్ణ జన్మస్థానం ప్రాప్తిరస్తని బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని లద్నూరు, మద్దూరు గ్రామాల్లో కార్యకర్తల వృద్ధ ప్రజా తెలంగాణ యాత్రలో భాగంగా పర్యటించారు. మద్దూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు షాపుల యజమానులను కలిసి బీజేపీకి ఓటేయాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం పార్టీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ మోదీ గళం.. యువత బలం అని, మన భవిష్యత్తు, దేశ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు కోసం మోదీని గెలిపించాలని కోరారు. దేశంలో మోదీ.. భువనగిరిలో బూర ఉండాలన్నారు. కాంగ్రెస్‌ది అభయహస్తం కాదని భస్మాసుర హస్తం అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌గౌడ్, ప్రచార కన్వీనర్ బల్ల శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ కూరెళ్ల రాజుగౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

తనను ఆశీర్వదిస్తే..

తనను ఆశీర్వదించండి.. బైరాన్‌పల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తానని బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలోని బురుజు వద్ద రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు వదిలిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం బురుజు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనాటి ఉద్యమకారులను సన్మానించి మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత వీరబైరాన్‌పల్లి గ్రామం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోవచ్చు అని అనుకున్నాం. కానీ మత రాజకీయాలకు తలొగ్గి కేసీఆర్ వీరబైరాన్‌పల్లి చరిత్రను కప్పివేసే ప్రయత్నం చేస్తే.. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిన ఘనత నరేంద్రమోదీకి, బీజేపీకి దక్కుతున్నదన్నారు. అనంతరం తర్వాత దూళిమిట్ట మండల కేంద్రంలో పర్యటించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి,బీజేపీ దూళిమిట్ట మండలాధ్యక్షుడు సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తాళం తీయని యజమాని.. తెరుచుకోని ఈఎస్ఐ

● బయటే కూర్చున్న సిబ్బంది ● రోగులకు అందని సేవలు

తూప్రాన్, ఏప్రిల్ 2: ఇంటి అద్దె చెల్లించకపోవడం ఈఎస్ఐ డిస్పెన్సరీకి వేసిన తాళం ఇంకా తీయలేదు. ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళం తీయకపోవడంతో మంగళవారం కూడా రోగులకు సేవలు అందలేదు. మధ్యాహ్నం వరకు బయటే కూర్చున్న సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్ద నిర్వహిస్తున్న శభాష్ పల్లి ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె చెల్లించడం లేదని సోమవారం తాళం వేసిన సంగతి తెలిసిందే. కాగా, ఇంటి యజమాని ప్రతాప్‌రెడ్డికి అద్దె చెల్లించకపోవడంతో మంగళవారం కూడా తాళం తీయలేదు. కనీసం ఈఎస్ఐ అధికారులు ఇంటి యజమానితో మాట్లాడలేదని తెలిసింది. ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళం తీయకపోవడంతో విధులకు వచ్చిన సిబ్బంది మధ్యాహ్నం 1 గంటల వరకు అక్కడే కూర్చుని వెళ్లిపోయారు. డిస్పెన్సరీకి వచ్చిన రోగులకు పరిస్థితి వివరించి రోగులకు సేవలు అందజేయకుండానే పంపించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు బిందుసాగర్



బిందుసాగర్

పుల్‌కల్, ఏప్రిల్ 2: జాతీయస్థాయి ఖోఖో పోటీలకు మండల కేంద్రం చౌటకూర్‌కు చెందిన బుర్కల బిందుసాగర్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని దోమలగూడ వ్యాయామ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపెడ్) చదువుతున్నాడు. జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో గతనెలలో జరిగిన సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొని ఎంపికయ్యాడు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగనున్న 56వ జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున బిందుసాగర్ ఆడనున్నాడు. ఈ సందర్భంగా తెలంగాణ జట్టుకు ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్కం నాగాగౌడ్ క్రీడా కిట్టును అందజేశారు. బిందుసాగర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికకావడం పట్ల ఖోఖో ఉమ్మడి మెదక్ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణముదిరాజ్ అభినందించారు.

టెక్స్ అకాడమీ గ్రూప్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

● కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్‌దాస్

పుల్‌కల్, ఏప్రిల్ 2: విద్యార్థులకు ఉద్యోగావకాశాల కోసం ఉచిత కోర్సు శిక్షణతో పాటుగా టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ సీ.మోహన్‌దాస్ తెలిపారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీ సహకారంతో ఉపాధి నైపుణ్యాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉచిత కోర్సులు, ప్లేస్‌మెంట్ అందించే డ్రైవ్‌లు విద్యార్థుల కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకుని, కేరీర్ ఎంపికలకు సన్నద్ధం కావాలని సూచించారు. కాగా, చౌహాన్ వంశీకృష్ణ, అరవపల్లి త్రివేణి, బండారి తిరుపతి, కోరోల్ల శ్రీకాంత్, కొండుపర్తి రాజాశ్రీకర్, కె.స్రవంతిలు ఉచిత కోర్సులు, ఉద్యోగావకాశాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ జోషీశ్రీపాద్ పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టని దివాలాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం

● ఎండిన పంటలకు పరిహారం అందించాలి

● రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలి

● సంగారెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న చింతా ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 2: రైతుల కష్టాలను దివాలకోరు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంగారెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ అన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపుమేరకు రైతులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావులతో కలిసి కలెక్టరేట్ డీఆర్‌వోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు అన్ని పంటలపై ఎకరాకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే 6న కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని చింతా ప్రభాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 2: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి ఆరు గ్యారంటీలను కూడా అమలు చేయలేకపోయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు ధాన్యం కొనుగోలుపై ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

గురుకుల లా విద్యార్థికి బెస్ట్ ఓరల్ ప్రజంటేషన్ అవార్డు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 2: సంగారెడ్డిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల లా కాలేజీ విద్యార్థి అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభ కనబర్చి అత్యుత్తమ అవార్డు అందుకున్నారు. ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్, పలు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా సోమవారం బ్యాంకాక్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డిలోని న్యాయ కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మిట్టకడప తిరుపతి పాల్గొన్నారు. 'ఏ క్రిటికల్ స్టడీ-ద లా కమిషన్ అండ్ ఇట్స్ లీగల్ రిఫార్మ్ ఇన్ ఇండియా' అనే పేపర్‌ను కాన్ఫరెన్స్‌లో ప్రజెంట్ చేశారు. ఇందుకు తిరుపతి బెస్ట్ ఓరల్ ప్రజంటేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. అనంతరం కాన్ఫరెన్స్ ముగింపులో అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థి తిరుపతికి అవార్డును అందజేసి అభినందించారు. తిరుపతికి అవార్డు దక్కడం పట్ల గురుకుల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు.

సింగూరు గురుకుల విద్యార్థులకు అంతర్జాతీయ అవార్డులు

పుల్‌కల్, ఏప్రిల్ 2: మండలంలోని సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ముంబయికి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరిలో నిర్వహించిన ఆర్ట్ పోటీలలో సింగూరు గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు వివిధ విభాగంలో అంతర్జాతీయ అవార్డులు సాధించారు. విద్యార్థులు సోయం మాలిక్ స్కెచ్చింగ్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించారు. దీంతోపాటుగా మరో ఇద్దరికీ ఆర్ట్ మెరిట్ అవార్డులు, 15 మంది విద్యార్థులకు ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ అవార్డులు, ఐదుగురికీ కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. వివిధ ఆర్ట్ విభాగంలో సింగూరు ఎస్సీ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రామకృష్ణ వరల్డ్ వైడ్ ఎక్సలెన్స్ పర్ఫామెన్స్ అవార్డు సాధించారు. ఆర్ట్ టీచర్ ఎంపీ శ్రీపాద్ వరల్డ్ ఫేమస్ ఆర్టిస్ట్ సాల్వడార్ డాలీ అవార్డు పొందారు. పాఠశాల, కళాశాలకు అంతర్జాతీయ గ్లోబల్ స్కూల్ అవార్డును వైస్ ప్రిన్సిపాల్ ఎన్.ఉదయ్‌కిరణ్ అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో వై.మల్లికార్జున్, జి.ప్రవీణ్‌కుమార్, ఎన్.రమేశ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2: పటాన్‌చెరు మండలం లక్డారం, ఇస్నాపూర్ చౌరస్తాలో, సంగారెడ్డి మండలం కందిలో, పటాన్‌చెరు బస్టాప్ వద్ద ప్రతిరోజూ భారీగా ట్రాఫిక్ జామ్ అవుతూ వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కొత్తగా యూటర్న్‌లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రద్దీని నియంత్రించినట్లు చెప్పారు. ఆయాటర్న్‌లను ఎస్పీ మంగళవారం పరిశీలించి మాట్లాడారు. జాతీయ రహదారిపై మాత్రమే కాకుండా పట్టణాల్లో పలు ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌లను ఏర్పాటు చేయడం, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న కొన్ని యూటర్న్‌లను మూసివేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారిపై పలు ప్రధాన కూడళ్లలో 52 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ వెంట పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి ఉన్నారు.

సిద్ధాపూర్‌లో ఎక్సైజ్ అధికారుల దాడులు

● 82 గంజాయి మొక్కలు ధ్వంసం



సిద్ధాపూర్‌లో గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఝరాసంగం, ఏప్రిల్ 2: ఝరాసంగం మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో జొన్న పొలంలో అంతర పంటగా సాగుచేస్తున్న 82 గంజాయి మొక్కలను మంగళవారం ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నమ్మదగ్గ సమాచారం మేరకు గ్రామానికి చెందిన హుస్సేన్‌బాబా తనజొన్న పొలంలో గంజాయి సాగు చేస్తున్నాడన్నారు. పొలంలోకి వెళ్లి పరిశీలించగా 82 గంజాయి మొక్కలు ఉన్నాయన్నారు. వెంటనే తమ సిబ్బందితో కలిసి ధ్వంసం చేశామని పేర్కొన్నారు. అక్కడే ఉన్న హుస్సేన్‌బాబా అల్లుడు యాదుల్‌ను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మొక్కల విలువ సుమారు రూ.8.20 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

● సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్


వాహనాల పేపర్లను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 2: వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి సిద్దిపేట పట్టణం హైదరాబాద్ రోడ్ కొత్త బస్టాండ్ వద్ద స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేటు లేని వాహనాలు, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ సంబంధిత వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 58 కేసులు నమోదు చేశారు. నెంబర్ ప్లేట్ లేని 8 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణలు మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు రవాణా శాఖ ఉత్తర్వుల మేరకు నెంబర్ ప్లేట్‌ను వాహనాలకు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వినయ్ సాగర్, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులు

కొండపాక, ఏప్రిల్ 2: బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన భారతదేశపు తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న అని రాష్ట్ర గౌడ సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంబటి బాలచంద్రం గౌడ్ పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని కొండపాకలో గౌడ సంఘం సభ్యులు, అంబటి బాలచంద్రం గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండపాక గౌడ సంఘం సభ్యులు సింగాటం రాములు గౌడ్, మారబోయిన రాములు గౌడ్, కొడకండ్ల యాదయ్య గౌడ్ ,కొడకండ్ల బిక్షపతి గౌడ్, ముస్త్యాల రమేష్ గౌడ్, అంబటి నర్సింలు గౌడ్, మంచాల నర్సింలు గౌడ్ పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దాసరి స్వామి, సదానంద్ గౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కుమారస్వామి, నాగరాజు, సంతోష్, కృష్ణ పలువురు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.


కొండపాకలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

● **హుస్నాబాద్:** సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా మంగళవారం హుస్నాబాద్ పట్టణ శివారులోని తాటి వనంలో గీత కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గీత కార్మికుల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, గౌడ నాయకులు తాళ్లపల్లి లక్ష్మన్, శ్రీనివాస్, కొయ్యడ శ్రీను, పెద్ద రవి, కుమార్, సదానందం, లక్ష్మన్ పాల్గొన్నారు.

● **చేర్యాల:** సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం చేర్యాల, కొమురవెల్లి మండల కేంద్రాలలో గౌడ కులసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాపన్న స్మారకస్థూపానికి పూల మాల వేసి నివాళులర్పించారు.


కుకునూరుపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కారుకు నిప్పంటించి.. ఆత్మహత్యాయత్నం

● ఈఎంఐలు కట్టలేదని తీసుకెళ్లడంతో..

మిరుదొడ్డి, ఏప్రిల్ 2, కారు ఈఎంఐలు కట్టలేదని యజమాని కారు తీసుకెళ్లడంతో మానసిక వేదనకు గురైన యువకుడు ఆ కారుకు నిప్పంటించి, తానూ నిప్పు అంటించుకునే ప్రయత్నం చేసిన ఘటన మంగళవారం మిరుదొడ్డిలో జరిగింది. మిరుదొడ్డికి చెందిన సద్దాం ఆరు నెలల క్రితం సోహెల్ అనే వ్యక్తి వద్ద కారును కొనుగోలు చేశాడు. కారు ఈఎంఐలు తానే చెల్లిస్తానంటూ తల్లి వద్ద ఉన్న బంగారం తీసుకెళ్లి.. తాకట్టు పెట్టి రూ. 40 వేలు సద్దాంకు చెల్లించాడు. అయితే, రెండు నెలలుగా ఈఎంఐలు చెల్లించకపోవడంతో సద్దాం కారును తీసుకెళ్లాడు. దీంతో మానసిక వేదనకు గురైన సోహెల్ మంగళవారం కారు వద్దకు వెళ్లి దాని అద్దాలు పగులగొట్టాడు. కారుకు నిప్పు పెట్టి.. అంతటితో ఆగకుండా తానూ నిప్పు పెట్టుకునేందుకు ప్రయత్నించాడు. వెంటనే స్పందించిన అక్కడి వారు సోహెల్‌ను అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది. మిరుదొడ్డి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ములుగు, ఏప్రిల్ 2: వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వంటిమామిడి మార్కెట్‌యార్డ్ ఎదుట చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంటిమామిడి మార్కెట్ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ ఓ వ్యక్తి జీవిస్తుండేవాడు. అతను చనిపోయి ఉండడాన్ని గుర్తించిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడికి సుమారు 60 సంవత్సరాల వయసు ఉంటుందని, సరైన సమయానికి భోజనం, నీరు లేక వడదెబ్బతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే ములుగు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి..

మర్కుక్, ఏప్రిల్ 2: మర్కుక్ మండలం గణేష్‌పల్లి గ్రామానికి చెందిన చీకోటి మల్లేశం(50) సోమవారం రాత్రి అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడని, ఉదయానికి చనిపోయాడని వారి కుటుంబసభ్యులు తెలిపారు. అతని మరణంపై అనుమానం ఉన్నట్లు మర్కుక్ మండల పోలీస్‌స్టేషన్‌లో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.

కొమురవెల్లిలో గుర్తుతెలియని వృద్ధురాలు..


వృద్ధురాలి మృతదేహం

చేర్యాల, ఏప్రిల్ 2: కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో గుర్తుతెలియని వృద్ధురాలు (69) మృతి చెందింది. మంగళవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించగా ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ ఈనెల 26వ తేదీన హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి ఆర్టీసీ బస్సులో ఇరువురు కొమురవెల్లికి చేరుకున్నట్లు టికెట్ లభ్యమైంది.

రెండోరోజు శిక్షణ

హుస్నాబాద్, ఏప్రిల్ 2: హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ అధికారులకు రెండో రోజు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 546 మంది పోలింగ్ అధికారులకు ఎన్నికల నిర్వాహణపై మాస్టర్ ట్రైనర్లతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

మద్దూరు, ఏప్రిల్ 2 : మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులని మంగళవారం ఎంపీడీవో ఎస్. రాంమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 1 నుంచి పెంచిన కూలీ రేట్లు అమల్లోకి వస్తాయన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నయని, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజామొయినుద్దీన్‌తో పాటు సెక్రటరీలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాలల కథా సంకలనానికి కథ ఎంపిక

చేర్యాల, ఏప్రిల్ 2: చేర్యాల పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ రచించిన 'కలిసి ఉంటే కలదుసుఖం' కథ జాతీయస్థాయి బాలల కథాసంకలనానికి ఎంపికైంది. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బాలల కథాసంకలనాలను ప్రచురించేందుకు జాతీయ స్థాయిలో బాలల కథలను ఆహ్వానించింది. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా బాలసాహితీ వేత్తలు రచించిన 256కథలు పరిశీలనకు రాగా, 86కథలను ఎంపిక చేశారు. వీటిలో కాంతికృష్ణ రచించిన కథ కూడా ఉందని సంస్థ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య తెలిపారు

ప్రధాని మోదీ నేతృత్వంలోనే దేశం సుభిక్షం

చేర్యాల, ఏప్రిల్ 2: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోనే దేశం అన్నిరంగాలలో అభివృద్ధి చెంది, ప్రజలు సుభిక్షంగా ఉంటారని బీజేపీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి బూర నర్సయ్య అన్నారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను వంచించాయని ఆరోపించారు. బీజేపీతోనే సుస్థిరత సాధ్యమని, తనకు అండగా నిలవాలని కోరారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి పరామర్శ

గజ్వేల్, ఏప్రిల్ 2: బీఆర్ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండే మధు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ పారుపాటి వెంకట్రామారెడ్డిలు వేర్వేరుగా ఆయన్ను నివాసంలో మంగళవారం పరామర్శించారు. వారివెంట నాయకులు పండరి రవీందర్‌రావు, చంద్రమోహన్‌రెడ్డి, మాదాసు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, పాల రమేశ్ తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాస్‌రెడ్డి

బెజ్జంకి, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆవరణలో కోటి రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, యూత్ మండలాధ్యక్షుడు ప్రవీణ్, టౌన్ ప్రెసిడెంట్ రాజు, నరసయ్య, ప్రభాకర్, కుమార్, ప్రసాద్, చంద్రం పాల్గొన్నారు.

'మాదిగల పట్ల వివక్ష తగదు'

చేర్యాల, ఏప్రిల్ 2 : మాదిగలపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపించడం తగదని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ అన్నారు. మంగళవారం చేర్యాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అధికశాతం ఉన్న మాదిగలను ప్రభుత్వం గుర్తించలేదని, మంత్రివర్గంతో పాటు కార్పొరేషన్ పదవులు, పార్లమెంట్ స్థానాలలో సరైన ప్రాధాన్యత కల్పించకపోవడం తగదన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగ నేతలు ఎదగకుండా అణగదొక్కారని విమర్శించారు. ఆయా అంశాలను నిరసిస్తూ ఈనెల 4న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తామన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్యేలకు జైలు ఖాయం

● కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి


ఎల్లారెడ్డిపేటలో ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవంలో పూజలు చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, ఏప్రిల్ 2: 'హరీశ్‌రావు పెద్ద డ్రామా ఆర్టిస్ట్, నా ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసులో సిద్దిపేట, దుబ్బాకకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డిలు జైలుకు పోవడం ఖాయం' అని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తొగుట మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ కేసులో కల్వకుంట్ల కవిత మాదిరిగా మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలు జైలుకు పోతారన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సారీ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైందని, అందుకే కరువు ఏర్పడిందన్నారు. కావాలనే హరీశ్‌రావు రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన అవగాహన రాహిత్యంతో రాష్ట్రంలో నెలకొన్న కరువును కాంగ్రెస్ తెచ్చిన కరువుగా ప్రజలను మభ్యపెట్టాలని చూడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేయాలని రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి ఈ రోజు నీటిని విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. రైతులు పండించిన ప్రతి పొద్దుతిరుగుడు గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎల్లారెడ్డిపేట గ్రామంలో జరిగిన ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చెరుకు విజయ్‌రెడ్డి, కొండల్ రెడ్డి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు శ్రీనాకర్‌రెడ్డి, నాయకులు బాబు, నిరంజన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి, అన్వర్, నర్సింహ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భరత్, పోచయ్య, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ సమావేశానికి కార్యకర్తలు


కొండపాక నుంచి సమావేశానికి తరలి వెళుతున్న నాయకులు, కార్యకర్తలు

మర్కుక్, ఏప్రిల్ 2: గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మర్కుక్ మండల వ్యాప్తంగా పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు బబ్బూరి రాందాస్‌గౌడ్, మేకల కనకయ్య, పత్తి బాబు, బిక్షపతి, ఎర్రవల్లి బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** గజ్వేల్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి కొండపాక మండలం నుంచి కార్యకర్తలు మండల అధ్యక్షుడు నూనె కుమార్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు

● **కుకునూర్‌పల్లి:** గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి కుకునూరుపల్లి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

ములుగు, ఏప్రిల్ 2: అట్టలు తయారీ చేసే కంపెనీలో మోటార్లను దొంగలించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో దోమకొండ శ్రీకాంత్ అనే వ్యక్తి రేకులషెడ్‌లో అట్టలు తయారుచేసే మిషన్లను ఏర్పాటు చేశాడు. అందులో ఉన్న మోటర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దర్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తామే దొంగలించామని ఒప్పుకున్నారు. వారు అదే గ్రామానికి చెందిన దమ్మని రాజు, పుట్టి మహేశ్ పోలీసులు గుర్తించారు. ఈ నెల 27న మూడు మోటర్లు, ఇనుప సామగ్రి దొంగలించి మనోహరాబాద్ మండల్ కాళ్లకల్లోని ఓ స్ర్కాప్ దుకాణంలో విక్రయించారని, వాటి విలువ దాదాపు 90000 ఉంటుందని పోలీసులు తెలిపారు. అమ్మిన వాటికి 4500 వచ్చాయి. ఆటో కిరాయి 500 ఇచ్చి ఇద్దరూ చేరో 2000 తీసుకున్నట్లు పోలీసులకు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సీపీఎంతోనే ప్రజాసమస్యల పరిష్కారం

● సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 2: సీపీఎంతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నదని, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విధానాలపై సీపీఎం నిస్వార్థంగా పోరాడుతుందన్నారు. పార్లమెంటులో వామపక్షాల బలంతగ్గడంతో పదేళ్ల కాలం నుంచి కార్పొరేట్‌శక్తులకు అనుకూల చట్టాలను ఆమోదించుకుంటున్నారన్నారు. సమావేశంలో నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, పుల్లంపల్లి నర్సవ్వ, కానుగుల రాజు, సున్నం యాదగిరి, దయ్యాల పోచయ్య, ఎల్లయ్య దండు రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

ములుగు/గజ్వేల్ ఏప్రిల్ 2: కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు మాట్లాడుతూ.. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు. నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ముదిరాజ్ జేఏసీ జిల్లా చైర్మన్ గుంటుకు శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముదిరాజ్ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యావంతులుగా ఎదిగి సమాజంలో మనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకోవాలని, జాతివివక్షపై ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ జేఏసీ చైర్మన్‌గా రొట్టెల శ్రీనివాస్‌ను నియమించి నియామకపత్రాన్ని ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అందజేశారు. వారితో జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బిక్షపతి, సిద్దిపేట జిల్లా నాయకులు పడిగ ప్రశాంత్, పుప్పాల బాలేష్, జగదేవ్‌పూర్ జేఏసీ మండలాధ్యక్షుడు రాగుల రాజు, శ్రీరాం నర్సింలు, మన్నె నర్సయ్య, పిట్ల సాయిబాబ, నాగులపల్లి వెంకటేశం, గజం రాజు, నెంటూరు నాగరాజు, డాక్టర్ సత్తయ్య ఉన్నారు.

ఉన్నత వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది తల్లిదండ్రులే

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎజాస్ అహ్మద్

గజ్వేల్, ఏప్రిల్ 2: ప్రతి మనిషి ఉన్నత వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది తల్లిదండ్రులేనని వికాస నిపుణుడు ఎజాస్ అహ్మద్ అన్నారు. గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రత్యేక శిబిరం ఆరోరోజుకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంత కాలం జీవించామని కాకుండా ఎంత గొప్ప వ్యక్తిత్వంతో జీవించామన్నదే ముఖ్యమని అన్నారు. ఆత్మవిశ్వాసంతో చేసే పనులు మనల్ని అందరికంటే ముందు వరుసలో నిలబెడుతాయని, జీవితంలో రాణించాలంటే చదువు ఒక్కటే సరిపోదన్నారు. ఉన్నత వ్యక్తిత్వ కూడా ఎంతో అవసరమని సూచించారు. వారితో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయభాస్కర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు లెఫ్టినెంట్ ఎం.భవాని, సుంచు రాజు, సాయికృష్ణ, కైలాష్, రాజశేఖర్, విష్ణుమూర్తి, తిరుపతి తదితరులు ఉన్నారు.

ఈ నెల 7 నుంచి ప్రవేశ పరీక్షలు

● ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ యాజ్ఞశ్రీ

దౌల్తాబాద్, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు, ఈ నెల7న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యాజ్ఞశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 6వతరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

'రైతులు సమగ్ర పోషణ చేపట్టాలి'

మర్కుక్, ఏప్రిల్ 2: రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలని ఏవో మాధవి మర్కుక్ రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో తెలియజేశారు. నత్రజని ఎరువులను ఒకే సారి కాకుండా రెండు నుంచి మూడు దఫాలుగా వేసుకోవాలని, బాస్వర సంబంధిత ఎరువులనుపై పాటుగా వేయరాదని, పొటాష్ ఎరువులను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. పంట కోత అనంతరం అవశేషాలను తగలబెట్టరాదని సూచించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు చౌహాన్ మాట్లాడుతూ.. పత్తి అనంతరం ఎంజీజీ 385 రకం పెసరును వేశానని తనకు 10 క్వింటాల దిగుబడి వచ్చిందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టీ. నాగేందర్‌రెడ్డి వ్యవసాయ విస్తరణాధికారి రజనీకాంత్, విష్ణువర్దన్, ములుగు డివిజన్ వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బాలవికాస నూతన కమిటీ ఎన్నిక

చిన్నకోడూరు, ఏప్రిల్ 2: మండలంలోని రాముని పట్ల గ్రామంలో బాలవికాస నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లం భానుచందర్, ఉపాధ్యక్షుడిగా చెట్టుపల్లి భానుచందర్, కోశాధికారిగా పోతరాజు శంకర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లం రవి, సహాయ కార్యదర్శిగా అనరాశి వెంకటేష్, కమిటీ సభ్యులుగా జేరిపోతుల లక్ష్మణ్, ఉత్కం పెంటయ్య, పంతం రాజశేఖర్, వర్కోలు మల్లేశం ,దేవులపల్లి రాజు, ప్లాంట్ నిర్వాహకుడిగా కూరపాటి నరేష్ ఎన్నికయ్యారు.

పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

వర్గల్, ఏప్రిల్ 2: అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గ్లోబల్ ఒలంపియాడ్ ఐటీ పోటీ పరీక్షలో వర్గల్ మండలం నెంటూర్ విశ్వశాంతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి ఐటీ గ్లోబల్ ఒలంపియాడ్ ఐటీ పోటీ పరీక్షలో ప్రతిభను చాటి ఏకంగా 22 అవార్డులను సాధించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో ఇస్రో శాస్త్రవేత్తలు ఎల్ రవికుమార్, ఎం హరినాథ్, ఫణీపవన్ చేతులమీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నాట్లు వివరించారు.

ప్రజలను పక్కదారి పట్టించడానికే 'బండి'పై అనుచిత వ్యాఖ్యలు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, ఏప్రిల్ 2: ప్రజలను పక్కదారి పట్టించడానికే ఎంపీ బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్‌పై చీటికి మాటికి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శ్రీరామ చంద్రుని చిత్ర పటాన్ని ప్రచారంలో పెట్టుకుంటే కాంగ్రెస్ ఎందుకు ఇబ్బంది పడుతున్నదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.

చికిత్స నిమిత్తం ఆర్థిక చేయూత

చేర్యాల, ఏప్రిల్ 2: చేర్యాల పట్టణానికి చెందిన ఏడాదిన్నర చిన్నారి మహిరా ఫలక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. చిన్నారి తండ్రి టైర్ పంక్చర్ షాప్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. వైద్యానికయ్యే ఖర్చు భరించే ఆర్థిక పరిస్థితి లేక సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక చావ డీవీధి కాలనీకి చెందిన అయిత రామలక్ష్మణ్, నందు, ఎండీ. తాహీర్ వ్యక్తిగత విరాళంతో పాటు సోషల్‌మీడియా ద్వారా పాప సమస్యను వివరించి రూ.1,06,500విరాళంగా సేకరించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం పాప కుటుంబసభ్యులకు నగదును అందజేశారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

గజ్వేల్, ఏప్రిల్ 2: ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని గజ్వేల్ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ కార్యదర్శి నాచారం శేఖర్ పిలుపునిచ్చారు. గజ్వేల్ డివిజన్ ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి సిద్దిపేట పట్టణంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా 5వ మహాసభలలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడంతో పాటు సమరశీల పోరాటంలో ముందుండబోతుందన్నారు. ఆయనవెంట డివిజన్ అధ్యక్షుడు కోనేరు ప్రవీణ్, డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రణయ్, ప్రవీణ్, నాయకులు భరత్, యాదగిరి ఉన్నారు.


కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ధర్మారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈవోతో కలిసి ప్రారంభిస్తున్న ఎంపీడీవో

మద్దూరు/దూళిమిట్ట ఏప్రిల్ 2: రేబర్తి సొసైటీ ఆధ్వర్యంలో మద్దూరు మండలంలోని రేబర్తి, గాగిళ్లాపూర్, లద్నూరు, ధర్మారం, సలాఖ్‌పూర్, మర్మాముల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్. రాంమోహన్, సొసైటీ సీఈవో బోయిని శ్రీధర్ తెలిపారు. మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అనంతరం వారు మాట్లాడారు. వరి కోతలకు ముందే రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొయినుద్దీన్, సెక్రటరీ అశోక్, రైతులు పాల్గొన్నారు. దూళిమిట్ట మండల కేంద్రంతో పాటు భైరాన్‌పల్లి, బెక్కల్, కొండాపూర్, తోర్నాల గ్రామాల్లో రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సొసైటీ సీఈవో శ్రీధర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

బెజ్జంకి, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ ఎం. శ్రీను, ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఓటు హక్కు, సైబర్ నేరాలపై మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ.. ఓటు ప్రాధాన్యత చాలా గొప్పదని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరైనా బెదిరిస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులును ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సి విజిల్ యాప్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1950 కు కాల్ చేసి తెలియజేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు లింకు పంపిస్తే ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరం జరిగితే హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


బెజ్జంకిలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఎం. శ్రీను, ఎస్ఐ కృష్ణారెడ్డి

డబ్బు,మద్యం పంపిణీ చేస్తే చర్యలు తప్పవు

● దౌల్తాబాద్, ఏపిల్ 2: పార్టీల అభ్యర్థులు, అభ్యర్థుల అనుచరులు ఎవరైన ఓటర్లకు డబ్బు, మద్యం పంచితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటమని తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన, అల్లర్లు, గొడవలు సృష్టించిన సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ చూపించి సరైన మార్గంలో నడిచే విధంగా పిల్లలకు సమయం కేటాయించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.


ముబారస్‌పూర్‌లో కనువిప్పు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ లతీఫ్